క్లుప్తంగా

మున్సిపల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్‌ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. యూనియన్‌ పట్టణాధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్‌, జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ విజయకుమార్‌ మాట్లాడుతూ మున్సిపల్‌ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులందరినీ పర్మినెంట్‌ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 24న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, సాయి, రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి కృతజ్ఞతలు


పూలుకుంట అరుణాచారి

బ్రహ్మంగారిమఠం : విశ్వకర్మ యోజన పథకం రూపొందించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఏపీ విశ్వబ్రాహ్మణ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూలుకుంట అరుణాచారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా కులవృత్తులు చేస్తున్న వారందరూ లబ్ధి పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. దేశంలో కులవృత్తులు చేసుకుంటున్న వారి జీవన విధానం మెరుగుపరుచుకునేందుకు ఇది ఒక అద్భుతమైన అవకాశమని తెలిపారు.

వైద్యశిబిరం


పెన్షనర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ అపర్ణ

ప్రొద్దుటూరు కల్చరల్‌ : వృద్ధులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ఆస్పత్రి ఆయుర్వేద వైద్యురాలు అపర్ణ పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్స్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో గురువారం పెన్షనర్లకు ఆయుష్‌ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, రోజు వ్యాయామం చేయాలని, పాలు, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. 70 మందిని పరీక్షించి మోకాళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్‌ సమస్యలు తదితర వాటికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శి రెడ్డెయ్య యాదవ్‌, కోశాధికారి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో రోడ్లపైకి పశువులను వదిలిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌ కమిషనర్‌ వై.రంగస్వామి తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై ఆవులు, ఎద్దులు సంచరించడం వల్ల పాదచారులకు ఇబ్బందిగా మారిందని, ఆవుల వల్ల పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయని కమిషనర్‌ తెలిపారు. పశువుల వల్ల పారిశుద్ధ్య లోపం తలెత్తుతుందని అన్నారు. వారం రోజుల్లో పశువుల యజమానులు వాటిని తమ సొంత స్థలంలో ఉంచుకోవాలని, రోడ్లపైకి వదిలితే జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్‌ హెచ్చరించారు.

ఎగ్జిబిషన్‌ వేలం వాయిదా

ప్రొద్దుటూరు : మున్సిపల్‌ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన ఎగ్జిబిషన్‌ వేలం పాటను అధికారులు వాయిదా వేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఎగ్జిబిషన్‌ నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోంది. ఇందు కోసం ప్రతి ఏడాది మున్సిపల్‌ అధికారులు వేలం పాట నిర్వహిస్తున్నారు. అనివార్య కారణాల వల్ల వేలం పాటను వాయిదా వేసినట్లు మున్సిపల్‌ అధికారులు తెలిపారు.

త్యాగధనులను స్మరించుకుందాం

ప్రొద్దుటూరు క్రైం : దేశం కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనులను స్మరించుకుందామని డాక్టర్‌ హనీఫ్‌బాబా తెలిపారు. మండలంలోని కాకిరేనిపల్లెలో సర్పంచ్‌ గురులక్ష్మి, మండల ఏపీఓ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ బీఏ వరప్రసాద్‌, టెక్నికల్‌ అసిస్టెంట్‌ నరసింహారావు, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ కొండయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మైదుకూరు : సెప్టెంబర్‌ 9న జరిగే జాతీయ లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు ఒకటవ అదనపు జుడిషియల్‌ మెజిస్ట్రేట్‌, మైదుకూరు కోర్టు ఇన్‌చార్జ్‌ న్యాయమూర్తి ఆర్‌.హారిక తెలిపారు. మైదుకూరు కోర్టులో సెప్టెంబర్‌ 9న జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించనున్నట్టు ఈ సందర్భంగా న్యాయమూర్తి తెలిపారు. ఇందులో ఇరువర్గాల పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల్లో రాజీ కావడం వల్ల ఇద్దరూ గెలిచినట్టేనని తెలిపారు.

సచివాలయాల వ్యవస్థతో గ్రామాల అభివృద్ధి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : సచివాలయ వ్యవస్థ ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దజొన్నవరం గ్రామంలో రూ. 40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జగన్‌ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వర్షాభావం వలన శ్రీశైలం డ్యాం నిండకపోవడంతో కేసీ కెనాల్‌కు నీటి విడుదల కాస్త ఆలస్యమవుతోందని తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌ రెగ్యులేటర్‌ ద్వారా 5వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేసి వెలుగోడు డ్యాంలో నిల్వ చేస్తున్నామన్నారు. రబీలో కేసీ రైతులకు నీరు ఇవ్వడానికి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకున్నారన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో ఏదో విధంగా అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. 2024 జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తుందన్ని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. 2024 తర్వాత టీడీపీ కనిపించకుండా పోతుందని రఘురామిరెడ్డి జోస్యం పలికారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. పెద్దజొన్నవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కొంత మంది గ్రామస్తులు పింఛన్లు, అమ్మ ఒడి పథకం మంజూరు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కె.జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కృష్ణయ్య, సచివాలయాల కన్వీనర్‌ శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ చిరాకి బాషా, నాయకులు చంద్రహాస్‌ రెడ్డి, బి.వెంకటసుబ్బారెడ్డి, కె.వీరారెడ్డి, ఓబుల కొండారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఓబుల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రమణయ్య నాయుడు, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్‌ రమాకుమారి, ఇతర శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగు !


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : వచ్చే ఎన్నికల్లో పరాజయం పొంది టీడీపీతోపాటు చంద్రబాబు కనుమరుగవుతారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరులో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జేసీఎస్‌ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసే దమ్ములేక చంద్రబాబు ఇతర పార్టీల నాయకుల కాళ్లు పట్టుకొని పొత్తు పెట్టుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఏం చేశారని వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి చేశాం కాబట్టే ఇప్పుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల వద్దకు వెళుతున్నామని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఎక్కడో హైదరాబాద్‌లో కూర్చుని అమావాస్యకు, పౌర్ణానికి ప్రజల వద్దకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నారన్నారు. టీడీపీ నిర్వహించిన బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ, భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాలు తుస్సుమన్నాయని ఎద్దేవా చేశారు. ప్రజల వద్దకు వెళ్లిన టీడీపీ నాయకులను ఏం చేశారని ప్రజలు నిలదీస్తున్నారని రఘురామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న టీడీపీ వారిని ప్రజలు ఛీ కొడుతున్నారని పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలో టీడీపీ వారు రోడ్లు, డ్రైనేజీలు వేయకుండానే బిల్లులు చేసుకున్నారని, మరుగుదొడ్లు కట్టకుండానే బిల్లులు చేసుకున్నారని దానిపై కమిషనర్లు, ఇంజనీర్లు జైలుకు వెళ్లారనే విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. టీడీపీ అవినీతితోనే 2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి 151 సీట్లు కట్టబెట్టారని.. ఇప్పుడు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సర్వేలు సైతం రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని చెబుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్న వలంటీర్లకు తోడు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను పార్టీ నియమించిందని సచివాలయ కన్వీనర్లకు ఐదు నుంచి పది లక్షల రూపాయలు ఇన్సూరెన్స్‌ కూడా చేయించిందని, త్వరలోనే గృహసారథులకు కూడా ఇన్సూరెన్స్‌ చేసేందుకు పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఎన్నికలు సమీపించే కొద్ది గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు మరింత బాధ్యతతో పని చేయాలని సూచించారు.

విధుల బహిష్కరణ


నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పోరుమామిళ్ల : స్థానిక గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్‌ మాట్లాడుతూ ఏండ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను ఇటీవల ఇక్కడకు వచ్చిన ఈఓ సుబ్బారావు వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. సర్పంచ్‌ సుధాకర్‌ ఇఓ సుబ్బారావుతో మాట్లాడి కార్మికులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు ఉండవని హామీ ఇప్పించారు. నెలనెలా సక్రమంగా జీతాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్డీ హసీనాతో కలిసి అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలు, నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని, ఎక్కడైనా గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాలు పనిచేయకపోతే వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే సచివాలయాల్లో నిర్వహించే స్పందన ద్వారా వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీదారులలో అసమ్మతి లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుత సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని ఆర్బీకేలలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. ప్రత్యేక సమావేశానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై ప్రత్యేకాధికారి అసహనం వ్యక్తం చేశారు. ఇకమీదట ఇలా జరగకుండా తప్పకుండా సమావేశాలకు హాజరు కావాలని కోరారు. డీడీఓలు విజయకుమార్‌, మోశ, శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు పంటల సాగుపై వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ప్రొద్దుటూరు : పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం రైతు నరేంద్రారెడ్డి పొలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి, మొక్కల సాంద్రత, వరిలో కొనలు తెంచుట, కాలిబాటలు తీయడం, పక్షి స్థావరాలను ఏర్పాటు చేయడం గురించి వివరించారు. ఏడీఏ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ 14 వారాలు పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తామని, రైతులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. ఖర్చులు తగ్గించి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడంపై వివరిస్తామన్నారు. ఏఓ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న చిన్న సాంకేతిక మార్పులు చేయడం ద్వారా నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్‌ నరేంద్ర, భువన, రైతు వ్యవసాయ శిక్షణ కేంద్రం ఏఓ శివశైలజ, పద్మజ, ఏడీఏ రమణారెడ్డి, వీఏఏ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు


నల్లాయపల్లి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం

అట్లూరు : ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీవాణి హెచ్చరించారు. మండలంలోని నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో బుధవారం జేసీబీతో సర్వేనెంబరు 91, 92, 93, 99, 103, 104లలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు చదునుచేస్తుండగా ఆమె జేసీబీ యంత్రాన్ని సీజ్‌ చేశారు. ఆయా సర్వే నెంబర్‌లలో గురువారం వీఆర్‌ఓలతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఇకపై ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు గృహసారథులకు బీమా నమోదు

పోరుమామిళ్ల : గృహసారథులు(జేసీఎస్‌ క్యాడర్‌కు) బీమా నమోదు కార్యక్రమం ఈనెల 19న బద్వేలు రోడ్డులోని పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఆయన స్వగృహంలో మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' 'జగనన్న సురక్ష' తదితర కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జేసీఎస్‌ క్యాడర్‌ కీలక పాత్ర పోషించారన్నారు. జేసీఎస్‌ నెట్‌వర్క్‌ ప్రవేశపెట్టినప్పుడు వారికి బీమా సౌకర్యం కల్పిస్తామని పార్టీ చెప్పిందని, ఇప్పుడా కార్యక్రమం అమలు జరుగుతున్నదన్నారు. గృహసారథుల వివరాలు ధృవీకరించి వివరాలు యాప్‌లో అప్‌లోడ్‌ చేయడం జరుగుతుందన్నారు. శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా గృహసారథులందరితో పద్మావతి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీలు, పార్టీ నాయకులు హాజరుకావాలన్నారు. గృహసారథులు సమావేశానికి ఆధార్‌ కార్డు, పాస్‌పోర్టు ఫొటో, ఓటర్‌ ఐడి, డ్రైవింగ్‌ లైసెన్స్‌, ఒరిజినల్‌తో పాటు జిరాక్స్‌ తీసుకరావాలన్నారు. అలాగే నామినీదారు ఆధార్‌, పాస్‌పోర్టు, ఓటర్‌ ఐడీ, డ్రైవింగ్‌ లైసెన్స్‌ తీసుకరావాలన్నారు. సమావేశంలో గృహసారథులకు భవిష్యత్‌ దిశా నిర్దేశం, పార్టీ ప్రణాళికలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ కల్లూరు రమణారెడ్డి పాల్గొన్నారు.

పగటిపూట 9 గంటల విద్యుత్‌ జగన్‌ చలువే


సమావేశంలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి

రాజుపాళెం : రైతులకు గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్‌ ఇచ్చే వారని, ప్రస్తుత ప్రభుత్వంలో పగటి పూటనే 9 గంటలు విద్యుత్‌ ఇవ్వడం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి చలువేనని ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. మండల పరిషత్‌ సభా భవనంలో గురువారం మండల ఇన్‌చార్జి ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్లుగా చూడడమే కాకుండా తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాలు లేని కారణంగా మైలవరం రిజర్వాయర్‌ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలన్నారు. కేసీ కెనాల్‌ ఏఈ జాన్సన్‌ మాట్లాడుతూ కేసీ కెనాల్‌ పరిధిలోని రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ఉన్నతాధికారులు తెలిపినట్లు ఆయన చెప్పారు. గాదెగూడూరు పశువైద్యాధికారి ప్రదీప్‌ రెడ్డి మాట్లాడుతూ పశువుల చెవులకు కమ్మలు లేకుంటే వేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏపీఓ గంగయ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, దీని వల్ల ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాలను తీసుకోవడం జరిగిందన్నారు. తహసీల్దార్‌ ఇందిరా రాణి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని అలాగే పొలాల్లో రాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ సయ్యదున్నీసాను నారాయణ రెడ్డి శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

రేపే కొత్తపల్లె పంచాయతీలో పోలింగ్‌


ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలింగ్‌ బాక్స్‌లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ 13వ వార్డుకు సంబంధించి శనివారం ఎన్నికల పోలింగ్‌ జరగనుంది. గతంలో ఉన్న వార్డు మెంబర్‌ మురళీధర్‌రెడ్డి మరణించడంతో ప్రస్తుతం ఈ ఎన్నిక జరుగుతోంది. మత్స్య కాలనీ, యానాది కాలనీ, కేవీఆర్‌ కాలనీలకు సంబంధించి ఈ వార్డు స్థానానికి మొత్తం 1172 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 567 మంది పురుషులు, 605 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్‌ జరగనుండగా, అనంతరం 3 గంటల నుంచి కౌంటింగ్‌ నిర్వహించనున్నారు. యానాది కాలనీలోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు మంది పోటీలో ఉండగా, ప్రధానంగా ఎన్నికల్లో పేరం బ్రహ్మానందరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తలపడుతున్నారు. విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే తాళ్లమాపురం పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డు స్థానానికి శనివారం పోలింగ్‌ జరగనుంది. ఈ వార్డులో మొత్తం 318 మంది ఓటర్లు ఉన్నారు. పసుపుల లక్ష్మీ నారాయణమ్మ, బడుగు శ్రావణి పోటీలో ఉన్నారు.

నా మట్టి–నా దేశంకు అపూర్వ స్పందన


రిటైర్డ్‌ ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న మండల ఉపాధ్యక్షుడు, సర్పంచ్‌

బి.కోడూరు : నా మట్టి–నా దేశం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. గురువారం మండలంలోని మేకవారిపల్లె సచివాలయ ఆవరణలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జెండా వందనం, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్‌ ఆర్మీ జవాన్‌ సిద్దమూర్తి వెంకటరెడ్డిని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ లక్ష్మీనరసారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుజనలు సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సీతారాముల విగ్రహ ప్రతిష్ట


రామాలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల బీసీకాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయంతో సమరసత సేవా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్మించిన రామాలయంలో సీతారామాంజనేయస్వాముల నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు గణపతిపూజతో ప్రారంభమై సాయంత్రం నూతన విగ్రహాలకు జలాదివాసం, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమం, మంగళహారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. 19వ తేదీ ఉదయం 8.20 గంటలకు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ నల్లేరు విశ్వనాథ్‌ రెడ్డి, ఆయన ధర్మపత్ని రామలక్ష్మిల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వాటర్‌ ప్లాంట్‌ ప్రారంభం

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్‌ ప్లాంట్‌ను గురువారం గ్రామ సర్పంచ్‌ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డిలు ప్రారంభించారు. సొంత నిధులతో నిర్మించిన ప్లాంటు వద్ద వారు ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టి బటన్‌ నొక్కి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు శుద్ధినీటిని అందించేందుకు ఈ ప్లాంటును నిర్మించామన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎర్రి రమణారెడ్డి, పలువురు వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : మండల పరిధిలోని ప్రకాష్‌ నగర్‌ మండల పరిషత్‌ ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ వై.రాఘవరెడ్డి గురువారం తనిఖీ చేశారు. స్మార్ట్‌టీవీల ద్వారా విద్యాబోధన, తరగతి గదుల పరిశీలన, ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని మధ్యాహ్నభోజనం పాఠశాలలో వండడం లేదని, బయట నుంచి తెస్తుండటంతో పిల్లలు సరిగా తినడం లేదని ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులే మధ్యాహ్న భోజనం వండటానికి ముందుకు రావాలని డీఈఓ సూచించినా వారు తమకు వీలు కాదని పేర్కొన్నారు. ఎవరో ఒక ఉపాధ్యాయుడు మధ్యాహ్నభోజన బాధ్యతను తీసుకోవాలని డీఈఓ కోరారు.

ఆటలపై ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలి

గోపవరం : ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆటలపై ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. 17 సంవత్సరాలు పైబడిన మహిళలు, పురుషులు ఆధార్‌కార్డు, మొబైల్‌ నెంబర్‌ ఆయా సచివాలయాల్లో అందజేస్తే వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌, క్రికెట్‌, బాడ్మింటన్‌ ఈ 5 ఆటలకు సంబంధించి ఆసక్తి కలిగిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కొక్కరు రెండు ఆటలలో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వారు ఆ సచివాలయంలోనే పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బదిలీ అయిన ఉద్యోగులను వెంటనే రిలీవ్‌ చేయాలి

బద్వేలు అర్బన్‌ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ బదిలీ అయిన ఉద్యోగులను వెంటనే రిలీవ్‌ చేయాలని ఆంధ్రప్రదేశ్‌ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు పాదిలి పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు అంతర్‌జిల్లా బదిలీలతో పాటు జిల్లా బదిలీలకు అవకాశం కల్పించి జూన్‌ నెలలో బదిలీ ఉత్తర్వులు ఇచ్చారని, బదిలీల ప్రక్రియ పూర్తయి ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఉద్యోగులను రిలీవ్‌ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. బదిలీ అయిన ఉద్యోగులను ఈ నెలాఖరులోపు రిలీవ్‌ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ప్రైవేట్‌ ఆస్పత్రి ఎదుట ఆందోళన

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రి వద్ద గురువారం బాధితులు ఆందోళన చేశారు. వసంతపేటకు చెందిన వైష్ణవి అనే గర్భిణీ గాంధీరోడ్డులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చూపించుకుంటోంది. నొప్పులు వస్తున్నాయని బుధవారం ఆమె ఆస్పత్రికి వెళ్లగా ఇవి పురిటి నొప్పులు కావని డాక్టర్‌ అన్నారు. రాత్రి ఏ సమయంలో పురిటి నొప్పులు వచ్చినా రావాలని, లేదంటే ఉదయం రమ్మని వైద్యురాలు చెప్పి పంపించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆమె ఆస్పత్రికి వెళ్లగా డాక్టర్‌ స్కానింగ్‌ చేయడంతో కడుపులో బిడ్డ చనిపోయింది. ఈ విషయాన్ని వైష్ణవి కుటుంబ సభ్యులకు చెప్పగా వైద్యురాలి నిర్లక్ష్యంతోనే బిడ్డ చనిపోయిందని ఆరోపిస్తూ వారు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు.

కడప రాయుని ఆలయంలో తిరుమంజన సేవ

కడప కల్చరల్‌ : తిరుమలేశుని తొలి గడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్‌ ఆళ్వార్‌ తిరుమంజన సేవ నిర్వహించారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ముందుగా ఒకసారి, శ్రావణమాసోత్సవాల సందర్భంగా మరోసారి మొత్తం రెండుమార్లు కోయిల్‌ ఆళ్వార్‌ తిరుమంజన సేవలు నిర్వహిస్తారని ఆలయ ఇన్‌స్పెక్టర్‌ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కృష్ణమోహన్‌, తివిక్రమ్‌ తదితరులు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పచ్చకర్పూరం, జాజికాయ, పసుపు, జాపత్రి, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో అంతరాలయాన్ని, ఆలయ పరివార దేవాలయాల లోపలి విగ్రహాలను శుద్ధి చేశారు. రోజువారి పూజల్లో వాడుతున్న వస్తువుల ద్వారా గర్భాలయంలో క్రిమి కీటకాల భయం లేకుండా చేసేందుకే ఈ కార్యక్రమం చేపడతారు. ఈ కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటలకు భక్తులకు దర్శనాలు కల్పించలేకపోయారు.

కంప్యూటర్‌ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

– వీసీ ఆచార్య చింతా సుధాకర్‌

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం కంప్యూటర్‌ ల్యాబ్‌లో జూనియర్‌ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న కంప్యూటర్‌ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ సూచించారు. గురువారం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతం, మార్కుల శాతం ఎలా లెక్కించాలో నేర్చుకోవాలన్నారు. వీటితో పాటు ఇంగ్లీషు టైపింగ్‌, ఎం.ఎస్‌. వర్డ్‌, ఎం.ఎస్‌. ఎక్సెల్‌ పూర్తిగా నేర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంప్యూటర్‌ సైన్స్‌ సహ ఆచార్యులు డా. కె. శ్రీనివాసరావు, డా. కృష్ణయ్య పాల్గొన్నారు.